సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం ॥ 9 ॥ మార్చి ॥ 2023



మొక్కలను సంరక్షించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంకటాపూర్‌లోని ఓం మౌజయా ఆశ్రమంలో బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ మొక్కలు నాటారు. మొక్కలను సంరక్షించాలని కోరారు.



గోశాలలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: హన్మకొండ జిల్లా వనమాలకనపర్తి జైదుర్గ గోశాలకు 20, జనగామ జిల్లా బొంతలపల్లె సహాయోగ్ గోశాలకు 20 రాజన్న కోడెలను అందజేశారు.

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కబోతగా, రాత్రి వేళ చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం



సీఎం చిత్రపటానికి జలాభిషేకం

ముస్తాబాద్(సిరిసిల్ల): భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండుతున్న దశలో మల్లన్నసాగర్ ద్వారా గోదావరి జలాలు అందించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని నామాపూర్ రైతులు పేర్కొన్నారు. నామాపూర్ మల్లన్నసాగర్ కెనాల్‌కు గోదావరి జలాలు బుధవారం చేరడంతో రైతులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి గోదావరి జలాలతో అభిషేకం చేశారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ విజయ, సురేందర్‌రావు, తాడెపు అనిల్, రవి, సుధాకర్‌రావు, నారాయణ, బాలచంద్రం, దేవేందర్, రామస్వామి, రాజు, కుమార్ పాల్గొన్నారు.

నేడు జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ బుధవారం తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో అభివృద్ధి పనులు, రోగులకు అందుతున్న వైద్యసేవలు, మౌలిక వసతుల కల్పనపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు, జిల్లా ఆస్పత్రి వైద్యులు ఈ సమావేశంలో పాల్గొంటారని అరుణ తెలిపారు.

రాజన్న ఆలయంలో ఐదు రోజులు ఆర్జిత సేవలు రద్దు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో శివ కల్యాణోత్సవం సందర్భంగా గురువారం నుంచి ఐదు రోజులపాటు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ బుధవారం ప్రకటించారు. ఈనెల 10న పార్వతీ రాజరాజేశ్వర స్వామివార్ల కళ్యాణ మహోత్సవం సందర్భంగా మధ్యాహ్నం 2 నుంచి కోడె మొక్కులు చెల్లించుకోవచ్చని తెలిపారు.

గురుకులంలో డీఈవో



బద్దెనపల్లి గురుకుల విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో రమేశ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ సందర్శించారు. పదోతరగతి విద్యార్థినులతో మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పరీక్షలు ఎలా రాయాలి, చదివిన అంశాలను ఎలా గుర్తుంచుకోవాలని సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


ఉత్తమ ఫలితాలు సాధించాలి



డీఐఈఓను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

ఇల్లంతకుంట(మానకొండూర్): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈవో మోహన్ కోరారు. ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం నిర్వహించిన క్రీడాదినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవం ఉన్న అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఐఈవోను సన్మానించారు. ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పుచ్చకాయపై మాతృమూర్తి రూపం



వేములవాడఅర్బన్: వేములవాడ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయుడు గాలిపెల్లి చోలేశ్వర్, విద్యార్థులు సోహెల్, శ్రావణ్‌లతో కలిసి పుచ్చకాయపై మాతృమూర్తి ఆకృతిని చెక్కారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం పాఠశాలలో ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ కుమారస్వామి అభినందించారు.



సిరిసిల్లలో సేవాభారతి ఆధ్వర్యంలో వేడుకలు



రెడ్డిసంఘం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణకు సన్మానం



వేములవాడ మున్సిపల్ ఆఫీస్‌లో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ మాధవి

ఎలుగెత్తిన మహిళా చైతన్యం

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: సిరిసిల్లలో మహిళా చైతన్యం ఎలుగెత్తింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం సిరిసిల్లలో వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ ఆఫీస్‌లో మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది చైర్‌పర్సన్ జిందం కళ సన్మానించారు. ఎస్బీఐ గాంధీనగర్ బ్రాంచ్‌లో బ్యాంకు మేనేజర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ ఆఫీస్‌లో చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మురికి.. శుద్ధి అయ్యేనా ?



- ఇది సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో ప్రవహించే డ్రెయినేజీ. పట్టణంలోని అద్దకం(డయింగ్) యూనిట్లలో వాడే రంగులు, రసాయనాలు, వ్యర్థ జలాలు ఈ మురికి కాల్వలో పారుతుంటాయి. ఆ మురికినీరు వ్యవసాయ భూముల్లో, సిరిసిల్ల శివారులోని చెరువుల్లో చేరి భూగర్భజలాలు కలుషితమవుతున్నా యి. వర్షాకాలంలో వరద పోటెత్తి మురికినీరు మానేరువాగులో కలుస్తుంది. మధ్యమానేరులోని ఆ నీటినే మిషన్ భగీరథ ద్వారా మళ్లీ శుద్ధిచేసి తాగునీరుగా అందిస్తున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా తొలగించేందుకు సిరిసిల్ల మున్సిపల్ అధికారులు కొత్తగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) ఏర్పాటు చేస్తున్నారు.



శాంతినగర్‌లో నిర్మిస్తున్న మురికినీటి శుద్ధి ప్లాంటు

- ఇది సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో మురికినీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఇంఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఈటీపీ). రూ.1.98 కోట్లతో 2019లో నిర్మించారు. డ్రెయినేజీకి అడ్డంగా మురికినీరు శుద్ధి అయ్యేలా ఈటీపీ ప్లాంటు నిర్మించాల్సి ఉండగా.. మురికినీరు కింద నుంచి వెళ్లిపోయేలా, ప్లాంటును పైకి నిర్మించారు. దీంతో అది నిరుపయోగంగా మారింది. ఆ ప్లాంటు పనిచేయాలంటే.. డ్రెయినేజీ కాల్వ అడుగుభాగం ఎత్తు పెంచాలి. ఇందుకు మరో రూ.5 కోట్లు వెచ్చించాలి. ఇది మున్సిపల్ ఇంజినీర్ల బాధ్యత రాహిత్యానికి నిదర్శనం. దీని కోసం వెచ్చించిన రూ.1.98 కోట్లు మురికిలో పోసినట్లు అయ్యింది.



- సిరిసిల్లను ముసిరిన మురికి సమస్యలు
- రూ.61.25 కోట్లతో ఎస్టీపీ ఏర్పాటు
- ఉత్తదైన ఈటీపీ ప్లాంటు
- ఎస్టీపీతో శాశ్వత పరిష్కారం

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం సిరిసిల్ల పట్టణాన్ని మురికి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. మురికినీటిని శుద్ధి చేసేందుకు గతంలో నిర్మించిన ఈటీపీ ప్లాంట్ అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా పడి ఉండగా.. ప్రస్తుతం నిర్మిస్తున్న ఎస్టీపీ ప్లాంట్ పనులు కొనసా..గుతూనే ఉన్నాయి. ఈ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియడం లేదు. గతంలో డ్రెయినేజీల మళ్లింపుతోనే పట్టణం వరదముప్పులో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్టీపీ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.61.25 కోట్లతో ఎస్టీపీ

సిరిసిల్ల పట్టణంలో రెండు ప్రధాన మురికికాల్వలు ఉన్నాయి. మొదటిది ఒకప్పటి మంచినీటి ఉదారువాగు. ఇది ఇప్పుడు మురికికాల్వగా మారింది. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్ నుంచి మొదలై శాంతినగర్‌లో ముగుస్తుంది. ఉదారు వాగు మొత్తం కబ్జాలకు గురికావడంతో ఇరుకుగా మారింది. ప్రస్తుతం ఈ డ్రెయినేజీ నీటిని శాంతినగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ వద్ద సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు(ఎస్టీపీ) ఏర్పాటు చేసి శుద్ధి చేయాలని నిర్ణయించారు. దీని కోసం ఆరు ఎకరాల భూమిని కొని, రూ.61.25 కోట్లతో ఎస్టీపీని నిర్మిస్తున్నారు. మురికినీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేసి తుమ్మలకుంటలోకి వదిలిపెట్టాలని ప్రతిపాదించారు. ఈమేరకు 70 శాతం ఎస్టీపీ పనులు పూర్తయ్యాయి.

మురికినీటి మళ్లింపుతో వరదముప్పు

సిరిసిల్ల కార్గిల్‌లేక్ నుంచి ఇందిరానగర్, తారకరామానగర్, బీవై నగర్, సుందరయ్యనగర్, వెంకంపేట, అంబికానగర్, పద్మనగర్ మీదుగా కొత్తచెరువులోకి వెళ్లే మరో ప్రధాన మురికికాల్వను మూడేళ్ల క్రితం మళ్లించారు. మురికినీరు కొత్తచెరువులోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. ఫలితంగా వర్షాకాలంలో సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్ ముంపునకు కారణమైంది. సిరిసిల్లలో మురికినీటిని శుద్ధి చేస్తే భూగర్భ జలాల కలుషిత సమస్యకు, పట్టణ ప్రజా ఆరోగ్యానికి సవాల్‌గా మారిన మురికినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

సిరిసిల్ల స్వరూపం

వార్డులు : 39
సిరిసిల్ల పట్టణ జనాభా : 1.05 లక్షలు
పట్టణ విస్తీర్ణం : 55.47 చదరపు కిలోమీటర్లు
ప్రధాన మురికికాల్వలు : 02
కుటుంబాలు : 22,608

ఎస్టీపీ పనులు జరుగుతున్నాయి



శాంతినగర్‌లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్టీపీ) పనులు జరుగుతున్నాయి. మంత్రి కేటీఆర్ చొరవతో మంజూరైంది. మరో మూడు నెలల్లో పూర్తవుతుంది. పూర్తి స్థాయిలో మురికినీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీని ఏర్పాటు చేస్తున్నాం. సిరిసిల్ల పట్టణంలోని ఇతర మురికి కాల్వల సమస్యలను పరిష్కరిస్తాం.

– జిందం కళాచక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్

కడుపు కోతలు వద్దు



బుట్టిరాజరాంకాలనీలో ఆరోగ్య మహిళ పథకం లోగోను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్

- తల్లులకు మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి
- కరీంనగర్‌లో ఆరోగ్య మహిళ పథకం ప్రారంభం
- క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన
- జిల్లా ఆస్పత్రిలో రేడియాలజీ హబ్ ప్రారంభం
- ఆడబిడ్డల కళ్లలో ఆనందం కోసం అద్భుత పథకం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌టౌన్: ముహూర్తాల పేరుతో సిజేరియన్లు చేపిస్తే అటు తల్లికి, ఇటు బిడ్డకు నష్టాన్ని చేకూరుస్తుందని... అత్యవసరమైతే తప్ప కడుపు కోతలు చేయించవద్దని తల్లులకు వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో అత్యధికంగా జరుగుతున్న సిజేరియన్లపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న కాన్పుల్లో 90 శాతం సిజేరియన్లే చేస్తున్నారని వాపోయారు. తల్లి ఆరోగ్యం దెబ్బతిని భవిష్యత్తులో గర్భసంచి తొలగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన చెందారు. వీటన్నింటిని అధిగమించేందుకే మహిళా దినోత్సవ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' పథకాన్ని ప్రకటించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలుకానున్న ఈ కార్యక్రమం కరీంనగర్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. బుధవారం కరీంనగర్‌లోని బుట్టిరాజారాం కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో 50 అదనపు పడకలు, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో 100 అదనపు పడకలను, తెలంగాణ డయాగ్నోస్టిక్ అనుబంధ రేడియాలజీ హబ్‌ను ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రిలో నిర్మించే క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు.

పేద మహిళల కోసమే ఆరోగ్య పథకం

మార్క్‌ఫెడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి మహిళలు తాము పడుతున్న ఆరోగ్య సమస్యలు భర్తలకు, బయటకు చెప్పుకోవడానికి బిడియ పడుతుంటారని, కొందరు ఆర్థిక ఇబ్బందులు, మరికొందరు ఆస్పత్రిలో మగ డాక్టర్లకు సమస్యలు చెప్పుకోలేక హాస్పిటల్‌కు వెళ్లడమే మానేశారన్నారు. ఇలాంటి వారికోసమే ఆరోగ్య మహిళ పథకం ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. మహిళలు సాధారణంగా ఎదుర్కొనే ఎనిమిది రకాల సమస్యలకు వైద్య సేవలు, 57 రకాల పరీక్షలు చేస్తామన్నారు. సర్జరీలు, ఇతర అడ్వాన్స్‌డ్ వైద్య పరీక్షల కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశామని, తల్లి బాగుంటేనే కుటుంబం బాగుంటుందన్న ఆశయంతో ఈ పథకం ప్రారంభిస్తున్నామన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఆడబిడ్డ కళ్లలో ఆనందం చూడాలని..

రాష్ట్ర పౌరసరఫరాలు, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఆడబిడ్డ కళ్లల్లో ఆనందం చూడాలని ఆరోగ్య మహిళ అనే అద్భుతమైన పథకం చేపట్టిన ఘనత సీఎం కేసీఆర్‌ది అన్నారు. ఈ ఒక్కరోజు కాదు ప్రతిరోజు మహిళా దినోత్సవం కావాలని ఆకాంక్షించారు.

మహిళా అధికారులకు సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ శ్వేతా మహంతి, అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, డీఎంహెచ్‌వో జవేరియా, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ రత్నమాల, డీఆర్‌డీవో శ్రీలత, డీసీవో శ్రీమాల, డీఎంవో పద్మావతి, రిసోర్స్ పర్సన్లను చీరసారెతో సన్మానించారు. మేయర్ సునీల్ రావు, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కె.విజయ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బి.శ్రీనివాస్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, సీపీ సుబ్బరాయుడు, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశీలిస్తూ.. మమేకమవుతూ..

- పల్లెబాటలో శిక్షణ అధికారులు
- ప్రజల జీవన విధానం పరిశీలన
- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన
- తొలిప్రయత్నంలోనే సివిల్స్‌కు ఎంపికైన అధికారులు
- క్రమశిక్షణతో చదివితే లక్ష్యం చేరుకోవచ్చు : సివిల్స్ శిక్షణ అధికారులు



రాజన్నపేటలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న సివిల్స్ శిక్షణ అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వారంతా సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వారే. లక్ష్యంతో చదివారు ఉన్నత కొలువులు కొట్టారు. రైతుకుటుంబం ఒక్కరిదైతే.. చిరువ్యాపారం చేసే నేపథ్యం మరొకరిది.. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం. శ్రమే ఆయుధమైతే లక్ష్యం ఎంత ఉన్నతమైనదైనా సాధించవచ్చని అంటున్నారు శిక్షణ సివిల్ సర్వీసెస్ అధికారులు. వారంతా ఇండియన్ ఎకానామికల్(ఐఈఎస్), ఇండియన్ స్టాటిస్టికల్(ఐఎస్ఎస్) సర్వీసెస్ ఉద్యోగాలు సాధించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన అర్జున్‌గుప్తా, అంచల్‌జైన్, పంకజ్‌మీనా, హర్షిత్ అగర్వాల్, అంకిత్‌మెండల్ శిక్షణలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని మారుమూల ప్రాంతం, మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం రాజన్నపేటకు వచ్చారు. గ్రామంలోని అభివృద్ధి పనులు.. అమలవుతున్న సంక్షేమ పథకాలు.. ప్రజల జీవన విధానం గురించి తెలుసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారంతా ఏడు రోజుల పర్యటనకు రాజన్నపేటకు వచ్చారు.

రాజన్నపేటలో అభివృద్ధి బాగుంది

రాజన్నపేట అభివృద్ధిలో ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉందని సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు పేర్కొంటున్నారు. తాము ఈ పర్యటనలో పరిశీలించిన అంశాలు, ఇక్కడి ప్రజల జీవన విధానం, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు భవిష్యత్‌లో తమకు కేస్ స్టడీగా నిలుస్తాయని పేర్కొన్నారు. పల్లెటూరు అయినప్పటికీ పోర్టబుల్ ఏటీఎంల వినియోగం, బ్లూటూత్ టెక్నాలజీ, ఆన్‌లైన్ బ్యాంకు లావాదేవీలు, పొదుపు సంఘాల పనితీరు, మహిళలు ఆర్థికాభివృద్ధి వైపు దూసుకెళ్లడం వంటి అంశాలలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

చదువుతోనే మహిళల అభివృద్ధి



మాది ఉత్తరప్రదేశ్. తండ్రి ప్రభులాల్ మీనా, తల్లి కమళాదేవి గృహిణి. మాది వ్యవసాయ కుటుంబం. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నాను. వెంటనే యూపీఎస్సీ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యాను. తల్లిదండ్రులు కూతుళ్లపై చిన్నచూపు చూడొద్దు. చదువుతోనే మహిళలు అభివృద్ధి సాధిస్తారు. అందుకే మేమే నిదర్శనం. శిక్షణలో భాగంగా కుగ్రామానికి ధైర్యంగా వచ్చామంటూ చదువుతోనే సాధ్యమైంది.

– పంకజ్ మీనా, ఐఈఎస్ అధికారి

సామాన్య వ్యాపార కుటుంబం



మాది పశ్చిమబెంగాల్. తండ్రి రమన్‌కుమార్ అగర్వాల్ వ్యాపారం చేస్తుండగా, తల్లి సర్వస్ అగర్వాల్ గృహిణి. ఢిల్లీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేశాను. మినిస్టర్ ఆఫ్ డిఫెన్స్ ఉద్యోగం చేస్తూ చదువుకున్నాను. అటు ఉద్యోగం, ఇటు చదువుకోవడం ఇబ్బంది అయినప్పటికీ.. పట్టుదలతో ముందుకెళ్లి, లక్ష్యాన్ని చేరుకున్నాను. లక్ష్యం చేరుకునేందుకు చదువు ఒక్కటే మార్గ. ఇష్టంతో చదువుకొని సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యాను.

– హర్షిత్ అగర్వాల్, ఐఈఎస్ అధికారి

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



మాది జమ్మూకాశ్మీర్‌లో త్రికుంట్లనగర్. మా తండ్రి చంద్రశేఖర్ వైద్యుడు, తల్లి వందనమహాజన్ స్కూల్ టీచర్. వారి ప్రోత్సాహంతోనే సివిల్స్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం నెరవేరింది. సివిల్స్ సాధించేందుకు అహర్నిశలు కష్టపడ్డాను. కాన్పూర్‌లో ఐఐటీ పూర్తి చేసి, బ్యాచ్‌లర్ మాస్టర్స్ ఎకానామిక్స్ చదివాను. కాలేజీ రోజుల్లోనే ఉద్యోగం చేస్తూ సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యాను. డిసెంబర్ 2022లో ఐఈఎస్‌కు ఎంపికై, 2023 జనవరిలో ఉద్యోగంలో చేరాను.– అర్జున్‌గుప్తా, ఐఈఎస్ అధికారి

మొదటి ప్రయత్నంలోనే..



మాది ఉత్తరప్రదేశ్‌లోని వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు భగీరథ్ మెండల్, చందన మెండల్ వ్యవసాయం చేస్తుంటారు. కోల్‌కతలో 2018లో డిగ్రీ. 2020లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి, అదే ఏడాదిలో యూపీఎస్సీ పరీక్షకు హాజరయ్యాను. మొదటి ప్రయత్నంలోనే సివిల్స్‌కు ఎంపికయ్యాను. కష్టపడి చదివితే ఎంతటి లక్ష్యాన్ని సాధించవచ్చు.

– అంకితమెండల్, ఐఎస్ఎస్ అధికారి

ప్రజల సహకారం బాగుంది



ఈ ప్రాంత ప్రజల సహకారం బాగుంది. ఈ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉన్నాయి. మాది ఉత్తరప్రదేశ్. మా తల్లిదండ్రులు అవినాశ్ జైన్, మీనాక్షిజైన్‌లు వ్యాపారం చేస్తుంటారు. మాస్టర్ డిగ్రీ చదువుతూనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాను. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగాన్ని సాధించాను. తల్లిదండ్రుల కలను సాకారం చేసేందుకు మాస్టర్స్‌లో జాయిన్ అయినప్పటి నుంచే సివిల్స్ లక్ష్యంగా పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకున్నాను.

– అంచల్‌జైన్, సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారి

క్లుప్తంగా

పురస్కారం అందుకున్న రాణీప్రసాద్



రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాణీప్రసాద్

సిరిసిల్లకల్చరల్: ప్రముఖ కవి, హస్తకళాకారిణి డాక్టర్ కందేపి రాణీప్రసాద్ ప్రభుత్వ మహిళా పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర శిశు సంక్షేమశాఖ సారథ్యంలో వరంగల్ కాకతీయ క్యాంపస్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లు అవార్డును అందజేశారు. అవార్డుతోపాటు రూ.లక్ష నగదు అందజేశారు. సుమారు 50 పుస్తకాల రచన ద్వారా బాలల్లో సాహిత్యాభిలాషను, పఠనాసక్తిని పెంచేందుకు కృషి చేసినందుకు అవార్డుకు ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రాణీప్రసాద్ మాట్లాడుతూ సాహిత్య సేవను విస్తృతం చేసేందుకు ఈ అవార్డు ప్రేరణనిస్తుందన్నారు. రాణీప్రసాద్‌కు జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం, పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం, జిల్లా కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- డీపీఆర్వో దశరథం



మహిళా జర్నలిస్టును సన్మానిస్తున్న డీపీఆర్వో దశరథం

సిరిసిల్లఅర్బన్: మహిళల అభివృద్ధి, అభ్యున్నతి, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని డీపీఆర్ఓ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, మహిళా జర్నలిస్టులను సన్మానించారు.

బహిరంగ సభకు పెద్దఎత్తున తరలివెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్ : కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో గురువారం నిర్వహించే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున తరలివెళ్లాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, జిల్లా పీసీసీ జనరల్ సెక్రటరీ భేతి సుభాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గం నుంచి సుమారు 2500 మంది తరలివెళ్లి సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, సర్పంచ్ పండుగ ప్రదీప్, ఎర్రం ఆగయ్య, ప్రభాకర్ రెడ్డి, నరేందర్, రగుడు పర్శరాములు తదితరులున్నారు.

‘పొగ’చూరుతున్న ఆరోగ్యం

- పొగాకుకు బలవుతున్న యువత
- స్టైల్ అనుకుని..బానిసలుగా..
- 90శాతం క్యాన్సర్లు పొగాకుతోనే
- జోరుగా గంజాయి, హుక్కా, సిగరెట్ల విక్రయాలు
- జిల్లాలో ఏటా రూ.300 కోట్ల సిగరెట్ల వ్యాపారం
- ఏడాదిలో 107 మందికి ఊపిరితిత్తుల సమస్య



“ఈ చిత్రంలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన లక్ష్మీనారాయణ. యుక్త వయస్సులోనే బీడీలు, సిగరెట్లు తాగడం అలవాటు అయ్యింది. తర్వాత కొన్ని రోజులకు వైద్యుల సలహాతో వాటిని మానేశాడు. ఇటీవల దమ్ముతో జిల్లా ఆస్పత్రికి రాగా ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ చేరి ప్రమాద స్థితిలో ఉందని వైద్యులు తెలిపారు. చికిత్స చేసిన తర్వాత బాగుపడ్డాడు.”

సిరిసిల్లటౌన్: పొగాకు.. సిగరెట్ తాగుతూ జిల్లాలో చాలా మటుకు దగ్గు.. దమ్ము సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. యుక్త వయసులో స్టైలిష్‌గా అలవాటు చేసుకున్న వారు కొన్ని రోజుల తర్వాత దానికి బానిసలుగా మారారు. రోజుల్లో కనీసం ఒక్కసారైన సిగిరెట్ తాగకుండా ఉండలేని స్థితికి చాలా మంది చేరుకున్నారు. ఇలాంటి వారిలో చాలా మంది నిత్యం స్థానికంగా తయారయ్యే బీడీల నుంచి పెద్ద.. పెద్ద కంపెనీల సిగిరెట్ల వరకు తాగుతున్నారు. ప్రస్తుత యువత మరింత ముందుకెళ్లి సిగరెట్లలోని పొగాకు తొలగించి గంజాయి నింపుకొని తాగుతున్నట్లు తెలిసింది. వీరు మరీ ప్రమాదకర స్థితిలో ఉంటున్నారని స్థానికంగా చర్చ ఉంది.

పెరుగుతున్న పొగాకు బాధితులు

జిల్లాలో పొగాకు, సంబంధిత ఉత్పత్తుల సేవనంతో రోగాలబారిన పడుతున్న వారు పెరుగుతూనే ఉన్నారు. ఏటా దేశంలో మార్చి రెండో బుధవారం ×నో స్మోకింగ్ డే¤ నిర్వహిస్తారు. దీనిలో భాగంగా పొగాకు ఉత్పత్తుల సేవనంతో జరిగే అనర్థాలను ప్రజలకు తెలిసేలా కార్యక్రమం చేపడతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు ఉత్పత్తుల వినియోగం, పర్యావసనాలపై మరింత ప్రచారం చేయాల్సి ఉంది. జిల్లాలో సుమారు 70 వేల మంది బీడీ కార్మికులు ఉండగా.. అంతకు రెండింతలు పొగాకు ఉత్పత్తులు సేవించేవారున్నారు. పొగాకు తాగుతూ కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్న సంఘటనలు ఉన్నాయి. ఏడాది కాలంగా ఒక్క జిల్లా ఆసుపత్రిలోనే 107 మంది ఊపిరితిత్తుల వ్యాధులతో ఐసీయూలో చికిత్స పొందారు. ఇక ప్రైవేటు, ఇతర నగరాలకు వెళ్లి చికిత్స తీసుకున్నవారి గణాంకాలు ఇంతకు మించి ఉంటాయని సమాచారం.

జోరుగా బీడీ.. సిగరెట్ల వ్యాపారం

రాజన్నసిరిసిల్ల జిల్లాలో పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లు, బీడీలు, చుట్టలు, పాన్‌మసాల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాకు హైదరాబాద్, కోల్‌కత, కరీంనగర్, వరంగల్ ప్రాంతాలతోపాటు వర్జీనియా, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి సిగరేట్లు వస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా సిగరేట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులను హోల్‌సేల్‌గా అమ్మే వ్యాపారులు సుమారు వంద మంది ఉన్నారు. ఒక్కొక్కరు తమ వ్యాపార ధోరణి బట్టి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో ఒక్క రోజులో సుమారుగా రూ.కోటికి తక్కువ కాకుండా వ్యాపారం సాగుతున్నట్లు అంచనా. ఈలెక్కన ఏడాదిలో సుమారు రూ.300 కోట్లు కేవలం పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు సాగుతున్నట్లు తెలుస్తోంది.

ఐసీయూలో ఊపిరితిత్తుల రోగుల వివరాలు

మాసం	రోగులు
2022	
ఏప్రిల్	15
మే	10
జూన్	07
జూలై	05
ఆగస్టు	03
సెప్టెంబర్	10
అక్టోబర్	10
నవంబర్	06
డిసెంబర్	16
2023	
జనవరి	10
ఫిబ్రవరి	15
మొత్తం	107

ఆయువు తగ్గుతుంది



పొగతాగే వారికి ఆయువు తగ్గుతుంటుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్లలో 90 శాతం పొగ తాగడమే కారణం. తంబాకు నమలడం ద్వారా నోటిక్యాన్సర్లు వస్తున్నాయి. సాధారణ పౌరులతో పోలిస్తే పొగతాగే వారికి అధికరెట్లు గుండెజబ్బులు వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ బిందు, పల్మనాలజిస్టు, సిరిసిల్ల

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

- పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులుండాలి
- పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి
- పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఇంటర్‌మీడియెట్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఇంటర్‌బోర్డు పరీక్షల షెడ్యూల్ ప్రకారం మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఇంటర్ ఫస్టియర్, మార్చి 16 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్ సెకండియర్ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం 18 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ 3,941 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా.. సెకండియర్ 4,497 మంది రాస్తున్నారని అనరాగ్ జయంతి వివరించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా రవాణా వసతి కల్పించాలని, కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వైద్యసేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరి వద్ద సెల్‌ఫోన్స్, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉండకూడదని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీఆర్‌వో టి.శ్రీనివాస్‌రావు, ఇంటర్మీడియెట్ అధికారి మోహన్, డీఈవో రమేశ్, డీటీవో వై.కొండల్‌రావు, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, డీపీవో రవీందర్, ‘సెస్’ డీఈ రఘుపతి, ఎస్సై శ్రీకాంత్ గౌడ్, ఆర్టీసీ, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి వేగంగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం అధికారులతో సమీక్షించారు. టీఎస్ఐపాస్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి సకాలంలో అనుమతులు ఇవ్వాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాటు అయ్యే పరిశ్రమకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. టీప్రైడ్‌లో రవాణా వాహనాల కొనుగోలుకు 19 మంది ఎస్సీ అభ్యర్థులకు రూ.58.82 లక్షలు, ఇద్దరు ఎస్టీ అభ్యర్థులకు రూ.7 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పరిశ్రమల శాఖ జీఎం ఉపేందర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్, డీటీవో కొండల్‌రావు, సహాయ లేబర్ అధికారి రఫీ, ‘సెస్’ డీఈ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు రుణాలు

- టెస్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు



తోటను పరిశీలిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు సహకార బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామని టెస్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేటలో లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటను బుధవారం పరిశీలించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ఎకరానికి రూ.50వేలు, అంతరపంటగా పంట రకాన్ని బట్టి పంట రుణాలు అందిస్తామని తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పెద్దవేని వెంకటియాదవ్‌ను రవీందర్‌రావు పరామర్శించారు. గంభీరావుపేటలో ఏర్పాటుచేసిన ఓ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. గజసింగవరంలో పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవానికి హాజరయ్యారు. జిల్లా హార్టికల్చరల్ ఆఫీసర్ జ్యోతి, క్లస్టర్ అధికారి స్రవంతి, రైతులు కమలాకర్‌రెడ్డి, నాగరాజు, కొమిరిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్, ఆర్‌బీఎస్ మండల, గ్రామ కో–ఆర్డినేటర్‌లు రాజేందర్, బాలకిషన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, కొండూరు గాంధీబాబు, సురేందర్‌రెడ్డి, దయాకర్‌రావు, రాజారాం పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ



జిల్లా న్యాయమూర్తి ప్రేమలతను సన్మానిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయినులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ కోరారు. తంగళ్లపల్లిలోని గిరిజన మహిళా సంక్షేమ డిగ్రీకాలేజీలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులపై పోరాడాలన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలను వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థినులు చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, స్థానిక సర్పంచ్ అంకారపు అనిత, జెడ్పీటీసీ పూర్మాని మంజుల, ఎంపీపీ పడిగెల మానస, ప్రిన్సిపాల్ రజనీలను సన్మానించారు. మండలంలోని మండెపల్లిలో సర్పంచ్ గనప శివజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో 100 మంది మహిళలను సన్మానించారు. సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్, చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ అధికారి లక్ష్మీరాజం, జిల్లా లీగల్ సర్వీసెస్ ప్రతినిధి చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, పెంట శ్రీనివాస్, జ్యోతి, కళ్యాణి, వైస్‌ప్రిన్సిపాల్ సుధాసింధు పాల్గొన్నారు.

వైద్యం, వ్యవసాయంపై అవగాహన



నామాపూర్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీ అధికారులు

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో ట్రైనీ సివిల్స్ సర్వీసెస్ అధికారులు నాలుగో రోజు వైద్యం, వ్యవసాయంపై శిక్షణ పొందారు. స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలను వైద్యాధికారి గీతాంజలిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు క్షేత్రస్థాయిలో అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం రైతువేదికలో గ్రామంలో సాగవుతున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పండించే ప్రధాన పంటలు, రైతులకు మద్దతు ధర, విత్తనాలు తదితర వివరాలపై రైతులతో మాట్లాడారు. ఏఈవోతో చర్చించారు. శిక్షణ అధికారులు అభిషేక్, సౌరభ్‌కాంత్, అన్‌మోల్, అమిత్ కుమార్, భావన మిశ్రా, ఎంపీడీవో రమాదేవి, సర్పంచ్ విజయ, కార్యదర్శి సౌజన్య, రాజిరెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడులు

ఎల్లారెడ్డిపేట: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, రైతు బీమా బాగున్నాయని ట్రైనీ ఐఏఎస్ అధికారులు అన్నారు. మండలంలోని రాజన్నపేటలో నాలుగో రోజు శిక్షణ సివిల్స్ అధికారులు బుధవారం ఆయిల్‌పామ్ తోటలు, మిషన్ భగిరథ నీటి సరఫరా, మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి గ్రామస్తుల నుంచి అడిగి తెలుసుకున్నారు. భగీరథ నీటి సరఫరా వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్క శంకర్, ఎంపీడీవో చిరంజీవి, కార్యదర్శి రవి, మిషన్ భగిరథ ఏఈ వినయ్, ఏవో భూంరెడ్డి, ఏఈవో ముకుంద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

వేములవాడ రూరల్: మండలంలోని మర్రిపల్లిలో అఖిల భారత సర్వీస్ అధికారులు ఉపాధిహామీ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ అధికారులు దిలీప్‌కుమార్, రాకేశ్ చరణ్, ఆదిత్య, సిమ్రాన్, పూనం సింగ్ చౌహాన్, వినోద్, సర్పంచ్ కట్కం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- జిల్లాలో నాలుగు మహిళా ఆరోగ్య కేంద్రాలు
- సిరిసిల్ల కార్మికక్షేత్రంలో ప్రారంభం



సిరిసిల్లలో ‘ఆరోగ్య మహిళ’ కరపత్రం ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ అరుణ , వైద్యాధికారులు

సిరిసిల్ల: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మహిళా ఆరోగ్య కేంద్రాలకు శ్రీకారం చుట్టిందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్లలోని కార్మిక క్షేత్రం సుందరయ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రత్యేక మహిళా ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం బాగుంటేనే ప్రతి ఇల్లు సౌభాగ్యంగా ఉంటుందన్నారు. జిల్లాలో తంగళ్లపల్లి, నేరెళ్ల, సిరిసిల్ల సుందరయ్యనగర్, వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా మహిళల ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహించి మహిళలకు సంబంధించి 8 రకాల సమస్యలకు సేవలందిస్తారని స్పష్టం చేశారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మహిళలకు పరీక్షలు చేసి వారి రికార్డులను డిజిటల్ విధానంలో ప్రత్యేక యాప్ ద్వారా మానిటరింగ్ చేస్తామన్నారు. జిల్లా ఆస్పత్రిలో వీరిక కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా టీబీ నివారణపై ప్లకార్డులు ప్రదర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, డాక్టర్ రజిత, టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశ్, ఎన్‌సీడీ జిల్లా సమన్వయకర్త కృష్ణమూర్తి, స్థానిక కౌన్సిలర్లు దూస వినయ్, దిడ్డి మాధవి, రాపెల్లి అరుణ, దార్ల కీర్తన, గడ్డం లత పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై పోస్టర్ ఆవిష్కరణ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ రూపొందించిన మహిళా సాధికారత, ఆధునిక ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం పోస్టర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ క్యాంపు ఆఫీస్‌లో ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సఖీ సెంటర్ ఇన్‌చార్జి రోజా తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్స్‌కు సన్మానం




సిరిసిల్ల విశాల సెలెక్షన్స్‌లో రామానుజమ్మకు సన్మానం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కండేయ వీధిలోని విశాల సెలక్షన్స్ షాపింగ్‌మాల్‌లో మాస్టర్ అథ్లెట్ టి.రామానుజమ్మను సన్మానించారు. షాపింగ్‌మాల్ యజమాని వేముల విష్ణు, మహిళలు పాల్గొన్నారు.

వృద్ధురాలి కంట్లో కారం కొట్టి..

- మెడలోని బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన దొంగలు



వృద్ధురాలు దేవవ్వ

కోనరావుపేట (వేములవాడ): వృద్ధురాలి కంట్లో కారం కొట్టి మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పల్లిమక్తకు చెందిన కుడుకుల దేవవ్వ–సిద్ధయ్య వృద్ధ దంపతులు. ఇంట్లో ఇద్దరే ఉంటారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వృద్ధురాలి ఇంట్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కరెంట్ సరఫరా నిలిపివేశారు. సిద్ధయ్య పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా వృద్ధురాలి కంట్లో కారంపొడి చల్లి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమాకాంత్ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో చేరుకొని ఆధారాలు సేకరించారు. కాగా అనుమానితులుగా భావిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

అన్నిరంగాల్లో ముందుండాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడ అర్బన్ : మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ.. మహిళలు లేనిదే మానవాళికి మనుగడ లేదన్నారు. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. సమాజంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తల సేవలు మరువలేనివన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు చీరలు అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, కౌన్సిలర్లు రామతీర్థపు కృష్ణవేణి, అన్నారం ఉమారాణి, ఎంపీటీసీ బుర్ర లహరిక, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి

- ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకుడు డాక్టర్ వికాస్‌రావు



మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తున్న ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు

వేములవాడఅర్బన్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం బాగుపడుతుందని కరీంనగర్ ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు, దీప దంపతులు పేర్కొన్నారు. వేములవాడ మండలం అగ్రహారంలోని ఫంక్షన్‌హాల్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం 11 గ్రామాలకు చెందిన 120 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ముంపు గ్రామాల్లో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, కుట్టుమిషన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచులు కదిరె రాజ్‌కుమార్, పండుగ ప్రదీప్, ఎంపీటీసీలు బుర్ర లహరికోశీఖర్, గాలిపెల్లి సువర్ణస్వామి, మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ ఉన్నారు.

యువకుడికి ఏడాది జైలు

జగిత్యాల జోన్ : ప్రేమిస్తున్నానంటూ ఓ యువతిని వేధింపులకు గురిచేస్తున్న యువకుడికి ఏడాది జైలుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా పోక్సో కోర్టు జడ్జి, జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి వీరయ్య బుధవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలత్రిపుర సుందరి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఇంటర్మీడియట్ చదువుతుండగా అదే గ్రామానికి చెందిన మేదరి గణేశ్ అనే యువకుడు సదరు యువతిని ప్రేమిస్తున్నానంటూ ఇబ్బందులకు గురిచేశాడు. విషయాన్ని యువతి తన తల్లిదండ్రులకు తెలుపగా గణేశ్‌ను మందలించారు. అయినా తన ప్రవర్తనలో మార్పురాలేదు. 2016 ఏప్రిల్ 20న సదరు యువతి తన తల్లిదండ్రులతో కలిసి మల్యాలలో జరిగే ఓ శుభాకార్యానికి వెళ్తుండగా వెంటపడ్డాడు. దీంతో తల్లిదండ్రులతో కలిసి జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ, ప్రస్తుత సీఐ ఆరీఫ్ అలీఖాన్ కేసు నమోదు చేసి గణేశ్‌పై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ బృందం సభ్యులు జి. రామకృష్ణ, బి. రాజు, కిరణ్‌కుమార్ సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా గణేశ్‌కు ఏడాది జైలుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
బిల్డింగ్ కిరాయికి ఇవ్వబడును
■ సిరిసిల్ల గాంధీనగర్, లక్ష్మీటాకీస్ ఎదురుగా మార్కెట్ ఏరియాలో 3 షెటర్లు 4 ఫ్లోర్లు 2000 చ.ఫీట్లు గలది బిల్డింగ్ కిరాయకు ఇవ్వబడును. సంప్ర:: 9440488956, 9490257222. [K-1219911]

WANTED
■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 21000+ రూం+ భోజనం ఫ్రీ. సెల్: 6281342090, 9949857816 [WA-6909]
■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకు ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. మరిన్ని వివరాలకు సంప్ర : 90300 07628 [L-537]

www.sakshi.com

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190584]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824